## చివరి టీ20 మనదే
4-1తో సిరీస్ కైవసం




7


# మానేరు జనత®

తెలుగు దినపత్రిక   ఇది జనం గొంతుక

1.2.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 283 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

అభ్యర్థించేవారు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## నేడు పార్లమెంట్ ముందుకు
# కేంద్ర బడ్జెట్

### ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం
### ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్

**ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు**

కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చున్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్ధిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




4



## మహా ఉప ముఖ్యమంత్రిగా
# సునేత్రా పవార్ ప్రమాణం

**శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక**
**కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె**
**అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ**

4



# ముగిసిన జనజాతర

**గద్దెలు వీడిన అమ్మవార్లు**
**చిలకలగుట్ట చేరిన సమ్మక్క**
**జయజయధ్వానాలతో వీడ్కోలు**
**ఇళ్లకు పయనమైన భక్త జనం**

మేడారం గద్దెపై కొలువై.. మూడు రోజులుగా పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల నడుమ పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారిని సాగనంపే క్రతువులో గిరిజన సంప్రదాయ సంగీత వాయిద్యాల చప్పుళ్లు.. కొమ్ముబూర శబ్దాలకు భక్తులు నృత్యాలు చేస్తుండగా.. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు.

## నోటీసులు అంటించడం
# చట్టవిరుద్ధం

### నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు



నా ఇంటి గోడకు నోటీసులు అంటించడం ముమ్మాటికీ చట్టవిరుద్ధం. విచారణకు సహకరిస్తానని చెప్పినా ఇలా ఎందుకు చేస్తున్నారు? ఇందులో రాజకీయ కోణం కనిపిస్తోంది.నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్నారు. నన్ను విచారించే పరిధి ఏసీపీకి లేదు. నా శాశ్వత నివాసం ఎర్రవెల్లి అని చెప్పినా పట్టించుకోలేదు. నేనెక్కడుంటే అక్కడికే నోటీసులు పంపించాల్సి ఉండగా మీరు దాన్ని ఉల్లంఘించారు.

**సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు**
**అయినా మీకు విచారించే అధికారం లేదు**
**ఎర్రవెల్లిలో అందుబాటులో ఉంటానని చెప్పాను**
**నేరుగా నోటీసులు ఇవ్వకుండా రాజ్యాంగ ఉల్లంఘన**
**ఎసిపికి తనను విచారించే అధికారమే లేదు**
**జూబ్లీహిల్స్ ఎసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ**
**నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి**

**జనతా న్యూస్, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం

మిగతా 2 లో

## కేసీఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు



**పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం**
**తెలంగాణ తెచ్చిన పెద్దాయననే వమానిస్తారా**
**ఎక్స్ వేదికగా మండిపడ్డ కెటిఆర్**

3

## గెలుపు గుర్రాలకే
# కాంగ్రెస్ టిక్కెట్లు

**స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ**
**రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి**
**కాంగ్రెస్ నేతలకు సూచించిన సీఎం**

మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు.



2

## గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

**పుష్కరఘాట్లు, రహదారుల విస్తరణపై దృష్టి**
**త్వరితగతిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి**
**దేవాలయాల్లో వసతులపై దృష్టి పెట్టి ముందుకు సాగాలి**
**రాష్ట్రంలో రోడ్ల నిర్వహ; మరమ్మత్తులకు పెద్దపీట**
**2036 ఒలింపిక్స్ నాటికి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలి.. సిఎస్ సమీక్ష**

2



## బిల్‌గేట్స్‌కు సెక్స్ వ్యాధులు

**రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు**
**ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం వెల్లడి**
**తీవ్రంగా ఖండించిన బిల్‌గేట్స్ బృందం**



4



# ముగిసిన జనజాతర

## గద్దెలు వీడిన అమ్మవార్లు... చిలకలగుట్ట చేరిన సమ్మక్క

## జయజయధ్వానాలతో వీడ్కోలు... ఇళ్లకు పయనమైన భక్త జనం

**మేడారం :** మేడారం గద్దెపై కొలువై.. మూడు రోజులుగా పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల నడుమ పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారిని సాగనంపే క్రతువులో గిరిజన సంప్రదాయ సంగీత వాయిద్యాల చప్పుళ్లు.. కొమ్ముబూర శబ్దాలకు భక్తులు నృత్యాలు చేస్తుండగా.. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై కొలువై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతంలోని గుళ్లకు తీసుకెళ్లారు. సమ్మక్కను బయటకు తీసుకొచ్చిన సందర్భంలో భక్తులంతా 'సమ్మక్క తల్లికి జై.. అందరినీ సల్లంగ చూడమ్మ'.. అని వేడుకుంటూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. పూజారుల బృందానికి చుట్టూ మూడంచెల భద్రతతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సహా పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మొత్తంగా మేడారం మహా జాతర ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు . నాలుగు రోజుల్లో రెండు కోట్ల మంది పైచిలుకు భక్తులు మేడారం జాతరకు తరలి వచ్చారు. మహా జాతర వేళ భక్తులు తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. తల్లుల వనప్రవేశంతో వన జాతర పూర్తయ్యింది. సాయంత్రం సమయంలో గద్దెలను పరిశుభ్రం చేసి, గిరిజన పూజారులు అమ్మవార్లకు సంప్రదాయ పూజలను నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ దేవతల పనప్రవేశం కార్యక్రమం ఆరంభమయ్యింది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాఘట్టం జనవరి 28 నుంచి 31వరకు జరుగగా.. శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలను ఆచరించి వన దేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. సమ్మక్క సారలమ్మలకు చీర, ఒడిబియ్యం, సారె పోసి దేవతలను మనసారా కొలుచుకున్నారు. సమ్మక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యలు పూజల అనంతరం పనప్రవేశం చేయిస్తారు. సమ్మక్కతల్లి చిలుకల గుట్టకు వెళ్లనుండగా సారలమ్మ కన్నెపల్లికి చేరుకోనున్నారు. అదేవిధంగా ఏటూరునాగారం మండలం కొండాయికి గోవిందరాజు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల కు పగిడిద్ద రాజును తిరిగి చేర్చనున్నారు. ఈ తంతుతో మహాజాతర ముగిసింది. అమ్మవార్ల దర్శనం అనంతరం మళ్లీ వస్తాం తల్లీ అంటూ భక్తులు ఇండ్లకు పయనమయ్యారు. జాతరలో చివరిరోజు మేడారంలోని వనదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ అమ్మవార్లకి మొక్కులను సమర్పించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు వారికి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. హైకోర్టు జడ్జిలు సృజన, రాణి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో భక్తులు నానా అవస్థలు పడ్డారు. దర్శనం సాఫీగా జరిగినా, రిటర్న్ జర్నీ ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని వాపోయారు. గంటల కొద్దీ బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

# గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

## స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ.. రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి

## కాంగ్రెస్ నేతలకు సూచించిన సీఎం రేవంత్



**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల పక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని రేవంత్ రెడ్డి టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల పక్రియ శుక్రవారంతో ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# నోటీసులు అంటించడం చట్టవిరుద్ధం

మొదటి పేజీ తరువాయి

చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అక్రమ పద్ధతిలో జారీ చేసిన నోటీసులను విస్మరించే హక్కు తనకు ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో తనకు సంబంధించిన నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. అలాగే ఏపీ హైకోర్టులోని వీడీ మూర్తి కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావించారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే.. 'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65



ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 అసఖఅ నిబంధనలను మీ దృష్టికి తెచ్చాను' అని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశిరచిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు. 'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.

## కెసిఆర్‌కు నోటీసుల పేరుతో వేధింపులు

### నేడు తెలంగాణలో నిరసనలకు కెటిఆర్ పిలుపు

సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నందుకు నిరసనగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు నేతలు నిరసన ప్రదర్శనలు చేయాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్రమంతటా శాంతియుతంగా ఆందోళనలకు దిగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకుపైగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సూచించారు. నిరసనల్లో భాగంగా ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీలు నిర్వహించనున్నాయి. నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నారు. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేయాలని, పోలీసులతో ఘర్షణలు వద్దని సూచించారు.

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

## పుష్కరఘాట్లు, రహదారుల విస్తరణపై దృష్టి

## త్వరితగతిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

## దేవాలయాల్లో వసతులపై దృష్టి పెట్టి ముందుకు సాగాలి

## రాష్ట్రంలో రోడ్ల నిర్వహ; మరమ్మత్తులకు పెద్దపీట

## 2036 ఒలింపిక్స్ నాటికి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలి

## విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష



**హైదరాబాద్,జనవరి31 :** వచ్చే సంవత్సరం జరిగే గోదావారి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావారి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలేట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్డ్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు. రవాణా, రోడ్లు భవనాలు శాఖ సమావేశంలో రాష్ట్ర రహదారుల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతి, నాణ్యత ప్రమాణాలు, ప్రజలకు అందిస్తున్న సేవల సామర్థ్యం తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి సమగ్రంగా సమీక్షించారు. రహదారుల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో చేపట్టిన పలు ప్రభుత్వ ఆసుపత్రులు వరంగల్, ఎల్.బి.నగర్, ఆల్వాల్, సనత్ నగర్, న్యూ ఉస్మానియా, హైకోర్టు నూతన భవనం, భవన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని, వాహనాల నమోదు, డ్రైవింగ్ లైసెన్సులు, రహదారి భద్రత చర్యల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, సెర్ప్, మిషన్ భగీరథ శాఖల పనితీరు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, గ్రామ పంచాయతీల పనితీరు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు పురోగతి, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మహిళ సంఘాల బ్యాంక్ లింకేజ్, తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. పథకాల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పారదర్శకతను పాటించాలని అన్నారు. గ్రామాల్లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ముఖ్యకార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ కుమార్ సుల్తానియా, ఎన్. శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తీ, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శృతి ఓఝా, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హన్మంతు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్. హరీష్, డైరెక్టర్ స్పోర్ట్స్ సోనిబాలా దేవి, డైరెక్టర్ కల్చర్ నరసింహారెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ లు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

**పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం**

**తెలంగాణ తెచ్చిన పెద్దాయననే అవమానిస్తారా**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**హైదరాబాద్,జనవరి31 :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు



అతిక్రమిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ అధికారులు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి.. పైశాచిక ఆనందం పొందడం దారుణం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.ఇది కేవలం 'పైశాచిక ఆనందం' పొందడమేనని కేటీఆర్ విమర్శించారు. చట్టం, న్యాయంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అక్రమ కేసులను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చేస్తోన్న ప్రతి తప్పుడు పనిని ప్రజల ముందు పెడతామని, సమయం వచ్చినప్పుడు ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

# మేడారం జాతరలో పోలీసుల పనితీరు భేష్

**అధునిక టెక్నాలజీతో సమర్ధంగా విధులు**

**రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి**

**ములుగు,జనవరి31 :** అదివాసీల సహకారంతో పోలీసులు జాతరలో ఉత్సాహంగా విధులు నిర్వహించారని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. వనదేవతలను దర్శించుకున్న డీజీపీ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన సీసీ పుటేజీల్లో జాతరలో భక్తుల రద్దీ, జాతరకు వచ్చే దారుల్లో ఉన్న ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే జాతరలో పిల్లలు, వృద్ధులు తప్పిపోతే అచూకీ తెలుసుకోవడానికి గత జాతరల్లో జాప్యం జరిగేదని, కానీ ఈ జాతరలో కొత్తగా చైల్డ్ ట్రాక్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టి పిల్లలు, వృద్ధుల చేతులకు హ్యాండ్ బ్యాండ్ పెట్టడం ద్వారా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పిపోయిన పిల్లలు, వృద్ధులను కనుక్కోవడం సులువ గా మారిందన్నారు తద్వారా బాధితులతో పాటు పోలీస్‌శాఖకు సంతృప్తిని కల్గించం దన్నారు. పోలీస్‌శాఖలో విధులు నిర్వహించేందుకు



సిద్ధమవుతున్న ట్రైయినీ ఐపీఎస్, డీఎస్పీలు పని నేర్చుకునేందుకు జాతరలో విధులు కేటాయించామన్నారు. 1996లో తాను ట్రైనీ ఐపీఎస్‌గా ఉన్నప్పుడు మేడారం వచ్చానని, అప్పటికీ ఇప్పటికీ జాతరలో చాలా మార్పులు వచ్చా యన్నారు. జాతరకు వచ్చే అన్ని మార్గాల్లో రోడ్లను వెడల్పు చేసి, ట్రాఫిక్ జామ్ అయితే పక్క నుంచి పోయేందుకు ప్రత్యా మ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్‌కు అస్కారం లేకుండా పొయిందన్నారు. డ్రోన్ లను ఏర్పాటు చేయడం ద్వారా జాతరలో ప్రతీ మూలకు జరుగుతున్న కార్యకలాపాల ను పరిశీలిం చేందుకు అనువుగా మారిందన్నారు. డీజీపీ వెంట మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, వరంగల్, రామగుండం పోలీస్ కమిషనర్లు సన్‌ప్రీత్ సింగ్, అంబర్ కిషోర్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# ట్యాపింగ్ చేయమని ఏ సిఎం చెప్పరు

**ఫోన్ ట్యాపింగ్ పేరుతో రేవంత్ వేధింపులు**

**బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**సిద్దిపేట,జనవరి31 :** రాజకీయ నేతలకు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ నెంబర్లు ఇచ్చి ట్యాప్ చేయమని ఏ ముఖ్యమంత్రి కూడా చెప్పరని అన్నారు. రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించడం కోసం ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమర వీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రెండేళ్ల నుంచి బీఆర్ఎస్‌పై వేధింపులు కొనసాగుతున్నాయి. తెలంగాణలో సమస్యలను పక్క దారి పట్టించి.. అలీబాబా 40దొంగలు తరహాలో కాంగ్రెస్ నాయకులు అనేక కుంభకోణాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదు. 1875లోనే ట్యాపింగ్‌పై చట్టం వచ్చింది.ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఎవరికి చెప్పరు. ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసం సిట్ వేశారు. విచారణ జరుగుతున్న క్రమంలో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకి లీకులు ఇస్తున్నారు. కాంగ్రెస్ కుట్రల నుండి కేసీఆర్ తెలంగాణ తేవడమే నేరమా?. రేవంత్ రెడ్డి కక్షతోనే కేసీఆర్‌కి నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు సమ్మక్క సారలమ్మ జాతరకి రమ్మని ఎర్రవెల్లికి వెళ్ళి ఆహ్వానిస్తారు. కానీ, పోలీస్ అధికారులు నంది నగర్ ఇంటి వెళ్లి నోటీసులు ఇస్తారు. ఇది దుర్మార్గమైన చర్య. ప్రతీకార వాంఛతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో హరీష్ రావు అడ్రస్ సిద్దిపేటలో ఉంటే హైదరాబాద్ ఇంటి అడ్రస్‌కి నోటీస్ ఇచ్చారు. కేసీఆర్‌కి మాత్రం హైదరాబాద్‌లో నోటీస్ ఇచ్చారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు శిక్ష వేయడం ఖాయం అని ఘాటు విమర్శలు చేశారు.

# జిహెచ్ఎంసి బడ్జెట్‌కు ఆమోదం

**రూ.11,460 కోట్ల బడ్జెట్ ప్రకటన**

**ఫిబ్రవరి 10తో ముగియనున్న పదవీకాలం**

**హైదరాబాద్,జనవరి31 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. గ్రేటర్ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వివిధ పార్టీల కార్పొరేటర్ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేసీఆర్ హయాంలో జీహెచ్ఎంసీ అప్పుల పాలైందని, అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన చేశారు. అయితే మేయర్ గద్వాల విజయలక్ష్మి నచ్చచెప్పడంతో ఇరు పార్టీల కార్పొరేటర్లు సర్దుమణిగారు. అనంతరం 2026-27 బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. బడ్జెట్ పద్దుల్లో జీహెచ్ఎంసీకి వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయం : రూ.6,441కోట్లుగా చూపారు. ఇందులో జీహెచ్ఎంసీ ఖర్చు : రూ.4,057కోట్లు, రెవెన్యూ మిగులు :




రూ.2,384 కోట్లు, జీహెచ్ఎంసీ రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లుగా చూపారు. కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం కేటాయింపులు: రూ.2,260 కోట్లుగా చూపారు. విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ : రూ.1,860 కోట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. 'ఇది మా చివరి సమావేశం. భావోద్వేగంతో కూడుకున్నది. ప్రతి నిర్ణయం వెనుక మా బాధ్యత కనిపించింది. ఉద్యోగులు, సిబ్బంది సమర్థంగా పని చేశారు. నగర అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిది. అంతా కలిసికట్టుగా పని చేశారు. ప్రజలకు మెరుగైన సేవల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు లభించాయి. పదవి ముగిసినా నా బాధ్యత మరువను. నగరం మరింతగా అభివృద్ధి చెందేందుకు నా వంతు కృషి చేస్తాను' అని విజయలక్ష్మి వెల్లడించారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి

**గతంలో లాగా కాకుండా కేటాయింపులు పెరగాలి**

**అన్యయాం జరిగితే బిజెపి ఎంపిలదే బాధ్యత**

**మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్,జనవరి31 :** కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. దానిని సరిదిద్ది కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# కరీంనగర్ మేయర్ సీటు మాదే

**కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా**



**కరీంనగర్,జనవరి31 :** కరీంనగర్ మేయర్‌తో పాటు మూడు చైర్మన్ పీఠాలు తమవేనని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం,కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంచార్జ్‌లు, కన్వీనర్లు, కో కన్వీనర్ల సమావేశంలో బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం. గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం. గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లుటిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తప్పుడు ప్రచారాలు నమ్మకండి. డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగింది. శనివారం డివిజన్ల వారీగా వచ్చిన నామినేషన్లను వేరు చేసి ఒక్కొక్కటిగా రిటర్నింగ్, సహాయ అధికారులు పరిశీలించారు. మొత్తం 1,257 నామినేషన్లు వచ్చాయి. దీనికి 736 మంది దరఖాస్తు చేశారు.

# కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం

**ఎటిఎం వద్ద ఆరు లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు**

**హైదరాబాద్ :** కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఉదయం ఈ ఘటన జరిగింది. తుపాకీతో కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. ఉదయం 7 గంటలకు ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు రిషద్ అనే వ్యక్తి వచ్చాడు. అతడిని దుండగులు వెంబడించి.. కాల్పులు జరిపారు. రూ. 6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి తూటా గాయమైంది. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి.. ఘటనాస్థలిలో సీసీటీవీ ఫుటేజీని సుల్తాన్ బజార్ పోలీసులు పరిశీలిస్తున్నారు. బైకుపై వచ్చిన ఇద్దరు దుండుగులు కాల్పులు జరిపి డబ్బు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు రిషద్‌ను నాంపల్లిలోని వస్త్ర వ్యాపారిగా గుర్తించారు. ఘటనాస్థలిని డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. క్లూస్ టీమ్స్ ఇప్పటికే ప్రాథమిక వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఉదయం 6:30 నుంచి 7 గంటల మధ్య ఘటన జరిగినట్లు మాకు సమాచారం అందింది. కాల్పులు జరిగిన వెంటనే అలర్ట్ అయ్యాం. నిందితుల కోసం ఐదు బృందాలు గాలిస్తున్నాయి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇలా జరగడం దురదృష్టకరం. నిందితులు తప్పించుకోలేరని అన్నారు.

# చర్లపల్లి వద్ద విషాద ఘటన


**తల్లీ ఇద్దరు పిల్లలు ఆత్మహత్య**

**రైలుకింద పడి బలవన్మరణం**

**హైదరాబాద్,జనవరి31 :** నగరంలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. రైలుకింద పడి ఓ కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. శనివారం తెల్లవారుజామున చర్లపల్లి - ఘట్కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగింది. ఎంఎంటీఎస్ డౌన్‌లైన్‌లో తల్లి, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నట్టుగా రైల్వే పోలీసులు గుర్తించారు. మృతులు బోడుప్పల్ హరితహారం కాలనీకి చెందిన పిన్నింటి విజయశాంతి రెడ్డి, విశాల్ రెడ్డి, చైతన్య రెడ్డిగా తెలుస్తోంది. గూడ్స్ రైలు లోకో పైలట్ సమాచారంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందిన వెంటనే రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల వద్ద రైల్వే టికెట్లు, విలువైన వస్తువులు లేవని జీఆర్‌పీ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబం ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి? ఆర్థికపరమైన ఇబ్బందులేమైనా ఉన్నాయా? ఇంకా ఇతర కారణాలా? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కుటుంబం ఆత్మహత్యతో బోడుప్పల్ హరితహారం కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మరోమారు అమెరికాకు తప్పని షట్‌డౌన్

## బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం



**వాషింగ్టన్ :** అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచి పోనున్నట్లు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ లోకి వెళ్లిపోయింది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను ఆమోదించడానికి అర్ధరాత్రి వరకూ గడువు ఉన్నా.. ఆ లోపు దాన్ని కాంగ్రెస్ ఆమోదించలేకపోయింది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువును కాంగ్రెస్ దాటవేయడంతో ప్రభుత్వం శనివారం పాక్షికంగా షట్ డౌన్ అయింది. దీంతో పలు సేవలు నిలిచిపోబోతున్నాయి. షట్‌డౌన్ స్వల్పకాలికంగా ఉండవచ్చని సెనేటర్లు చెబుతున్నారు. మరోవైపు గడువుకు ముందు బడ్జెట్ పై ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో, తాత్కాలిక లేదా పూర్తి-సంవత్సర నిధుల చర్యను కాంగ్రెస్ ఆమోదించే వరకు కీలకం కాని పలు ప్రభుత్వ కార్యకలాపాల్ని నిలిపేస్తున్నారు. సభ తిరిగి సమావేశం అయ్యాక సెనేట్ మద్దతు ఉన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి తగినంత మద్దతును కూడగట్టడానికి చట్టసభ సభ్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ?. అమెరికాలో దాదాపు మూడో వంతు ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, రక్షణను నిర్వహించే అనేక ఏజెన్సీలలో షట్‌డౌన్ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విభాగాలు రాత్రికి రాత్రే షట్‌డౌన్ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించాలని భావించాయి. కానీ ఇది తాత్కాలికమేనన్న అంచనాలతో ఆ ప్రతిపాదన విరమించుకున్నాయి. వచ్చే వారం ప్రారంభంలో కాంగ్రెస్ ఊహించిన విధంగా ప్యాకేజీని ఆమోదిస్తే, కొన్ని రోజుల్లో నిధుల పునరుద్ధరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. షట్‌డౌన్ కొనసాగితే మాత్రం పదివేల మంది ప్రభుత్వ కార్మికులు జీతం లేని సెలవును ఎదుర్కోవలసి రావచ్చు, లేదా నిధులు అందేవరకు జీతం లేకుండా పని చేయాల్సి రావచ్చు.

# బిల్‌గేట్స్‌కు సెక్స్ వ్యాధులు

## రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు
## ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం వెల్లడి
## తీవ్రంగా ఖండించిన బిల్‌గేట్స్ బృందం



**న్యూయార్క్:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించి ఓ సంచలన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. రష్యన్ అమ్మాయిలతో బిల్‌గేట్స్‌కు లైంగిక సంబంధాలు ఉన్నాయని, అందువల్లే ఆయన సుఖ వ్యాధుల బారిన పడ్డారనే ఆరోపణ బయటకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోన్న ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం విచారణకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2013లో తనకు తాను రాసుకున్న ఈ-మెయిల్‌లో ఎప్‌స్టీన్ ఈ విషయాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. రష్యా అమ్మాయిలతో గేట్స్ శృంగార సంబంధాలు సాగించారని, ఫలితంగా ఆయన లైంగిక వ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ పేర్కొన్నారు. ఆ విషయం బయట పడకుండా ఉండడం కోసం తన భార్య మిలిందాకు గేట్స్ రహస్యంగా యాంటీబయాటిక్స్ ఇవ్వాలనుకున్నారని, తనను ఆ మాత్రలు అడిగారని ఎప్‌స్టీన్ తెలిపారు. ఆ తర్వాత తనతో స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నారని కూడా అదే మెయిల్‌లో ఎప్‌స్టీన్ పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని ఆరోపణలను గేట్స్ బృందం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని, తనతో స్నేహం కొనసాగించకపోవడం వల్లే ఎప్‌స్టీన్ నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొంది. అంతేకాదు, టెస్లా అధినేత ఎలన్ మస్క్‌కు సంబంధించిన అంశాలు కూడా ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో ఉన్నాయి. వర్జిన్ దీవులలోని తన ఐల్యాండ్‌ను సందర్శించాలని తాను మస్క్‌ను ఆహ్వానించానని, అయితే తన ఆహ్వానాన్ని మస్క్ పలుసార్లు తిరస్కరించారని కూడా ఎప్‌స్టీన్ పేర్కొన్నారు.

# ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్‌గా కెవిన్ వాష్

## ట్రంప్ ప్రకటనతో అనూహ్య మార్పులు
## బంగారం, వెండి ధరలపై తీవ్ర ప్రభావం

**వాషింగ్టన్ :** తాజాగా బంగారం మరియు వెండి ధరలు అనూహ్యంగా పడిపోవడానికి కారణం కెవిన్ వాష్ అని ఆర్థిక విశ్లేషకులు గుర్తించారు. ట్రంప్ ఆయనను ఫెడరల్ రిజర్వ్ తదుపరి ఛైర్మన్‌గా నామినేట్ చేయడంతో గ్లోబల్ మార్కెట్లు ఆందోళనకై గురయ్యాయి. ఫెడరల్ రిజర్వ్ మాజీ గవర్నర్లు వడ్డీ రేట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తారని మార్కెట్ ఇన్వెస్టర్లు బాగా తెలుసు. వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉన్నందున డాలర్ బలోపేతం ఎక్కువగా జరుగుతుందని అంచనా వేశాయి. దీని వల్ల ఇన్వెస్టర్లు భయాందోళనకు లోనై బంగారం, వెండి అమ్మకాలను భారీగా పెంచారు, ఫలితంగా ధరలు కుప్పకూలిపోయాయి. గతంలో కూడా ఫెడరల్ రిజర్వ్ గవర్నర్లు నామినేట్ అయ్యినప్పుడు బంగారం మరియు వెండి ధరల్లో మార్పులు నమోదయ్యాయి. సాధారణంగా, వడ్డీ రేట్లు పెరిగే సూచనలు వస్తే సౌకర్యవంతమైన ఇన్వెస్ట్‌మెంట్స్ పట్ల భయం పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో, భౌతిక ధాతువులకు దారిచూపే డిమాండ్ తగ్గిపోతుంది, తద్వారా మార్కెట్ ధరల్లో తగ్గుదల జరుగుతుంది. అంచనాలు, భవిష్యత్తు ధోరణులు మార్కెట్ విశ్లేషకులు, ఈ పరిస్థితి కొంతకాలం కొనసాగవచ్చు అని అంచనా వేస్తున్నారు. డాలర్ బలోపేతం పెరగడం, వడ్డీ రేట్లపై నష్ట భయం, అలాగే అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు బంగారం, వెండి ధరలకు ప్రభావం చూపుతాయి. ఇన్వెస్టర్లు సురక్షిత ఆస్తులపై దృష్టి సారిస్తే, ధరల పునరుద్ధరణ కొంత ఆలస్యమవుతుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి చీఫ్‌గా ఆ విభాగం మాజీ అధికారి కెవిన్ వార్ష్ (55)ను నామినేట్ చేస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుత చీఫ్ జెరోమ్ పావెల్ పదవీకాలం మేలో ముగియనుండగా.. ఈ స్థానంలో కెవిన్ రానున్నారు. 2017లో ఫెడ్ చీఫ్‌గా పావెల్‌ను ఎంపిక చేసుకున్న ట్రంప్.. వడ్డీ రేట్లను త్వరగా తగ్గించడం లేదని ఆయనపై తీవ్ర విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజా నిర్ణయంపై ట్రంప్ స్పందిస్తూ.. కెవిన్ తనకు చాలా ఏళ్లుగా తెలుసునని అన్నారు. రానున్న రోజుల్లో ఆయన ఉత్తమ ఫెడ్ చీఫ్‌లలో ఒకరు కావడంలో సందేహం లేదన్నారు. ఆయన ఎప్పటికీ నిరాశపరచడని పేర్కొంటూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్టు చేశారు. అయితే, అధ్యక్షుడి నియామకానికి సెనేట్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది.ఫెడరల్ బోర్డు ఆఫ్ గవర్నర్స్‌లో కెవిన్ వార్ష్ 2006 నుంచి 2011 వరకు సభ్యుడిగా ఉన్నారు. 35 ఏళ్ల వయసులోనే ఆ బాధ్యతలు చేపట్టిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం స్టాన్‌ఫర్డ్ బిజినెస్ స్కూల్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

# నేడు పార్లమెంట్ ముందుకు కేంద్ర బడ్జెట్

## ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం
## ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్
## ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు




**న్యూఢిల్లీ :** కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ఉంటుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశలు నిజం చేసే దిశగానే కేంద్రం బ్జడెట్ ఉండనుందని సమాచారం. పన్నుల విషయంలో కీలక మార్పులు జరగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026లో ఆదాయపు పన్ను నిబంధనలో పలు మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, సీనియర్ సిటిజన్లకు లాభం చేకూరేలా ఈ మార్పులను కేంద్రం తీసుకువస్తుందని సమాచారం. పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, పన్ను విషయంలో భారాన్ని తగ్గించడం, పారదర్శకత, డిజిటల్ పన్ను వ్యవస్థను ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడమే లక్ష్యంగా బడ్జెట్ ఉండనుందన్న వార్తలు వస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను చట్టం 1961 నుంచి.. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 వరకు సరళమైన పరివర్తనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సత్వర పన్ను వాపసులు, సరళీకృత సమ్మతి కీలక లక్ష్యాలుగా ఉండనున్నాయని సమాచారం. వార్షిక సమాచార ప్రకటన, పన్ను చెల్లింపుదారుల సమాచార సారాంశం వంటి వ్యవస్థలు పన్ను దాఖలును సులభతరం చేశాయి. డిజిటల్ వ్యవస్థను మరింత నమ్మదగినదిగా, పారదర్శకంగా మార్చడంపై బడ్జెట్ 2026 దృష్టి సారించే అవకాశముంది. ఏఐని సరిగ్గా ఉపయోగించినట్లయితే పన్ను రిటర్న్‌లను ఆటోమేటిక్‌గా దాఖలు చేయొచ్చని, లోపాలను తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను వాపసుల కోసం రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సాయపడనుంది. ఆదాయపు పన్ను కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రాధాన్యం, క్రిప్టో, డిజిటల్ ఆస్తులపై స్పష్టమైన నియమాలకు ఉపయోగ పడుతుంది. మరోవైపు.. కొత్త పన్ను విధానం వచ్చినప్పటికీ కొన్ని అంశాల్లో పాత పన్ను విధానం అందుబాటులో ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గృహ రుణాలు, బీమా ప్రీమియంలు, పదవీ విరమణ పొదుపులు, ఇతర పెట్టుబడులకు సంబంధించిన పన్ను తగ్గింపులకు సంబంధించి పాత విధానాలే ఉంటాయని తెలుస్తోంది. బాగా పన్ను రాయితీ కలిగిన వారు పాత పన్ను విధానం నుంచి ప్రయోజనం పొందడం కొనసాగించవచ్చు. అయితే తక్కువ పన్ను మినహాయింపులు ఉన్న వ్యక్తులు కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సరైన విధానాన్ని ఎంచుకోవడం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అవుతుంది. విద్యా, గృహ ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలను నిర్వహించే కుటుంబాలకు ఈ మార్పులు ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని అందించవచ్చు. 2026లో ఆదాయపు పన్ను నియమాల మార్పు నుంచి సీనియర్ సిటిజన్లు కూడా ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా పెన్షన్ ఆదాయం, వాటి వడ్డీ ఆదాయాలపై సరళీకృత పన్ను విధించడం ద్వారా పన్ను దాఖలును సులభతరం చేస్తాయి. ఏది ఏమైనప్పటికీ.. ట్యాక్స్ ప్లేయర్లకు కేంద్రం శుభవార్త చెప్పనుందని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన పన్ను విధానం పెద్దగా ప్రయోజనకారిగా లేదన్న విమర్శలు వచ్చాయి.

# డిపాజిట్లను, ఈక్విటీలను ఒకే రకంగా చూడాలి

## పన్నుల సమానత్వం పాటిస్తే మంచిది:ఎస్‌బిఐ చీఫ్

**ముంబయి :** బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ల నుంచి వచ్చే రిటర్నులపై పన్ను విషయంలో సమానత్వం ఉండాలని ఎస్‌బిఐ ఛైర్మన్ కోరారు. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. మంబయిలో జరిగిన ఓ బ్యాంక్ ఈవెంట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్ కు ముందు ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పొదుపు సాధనాల విషయంలో ప్రపంచంలో ఎక్కడా అసమానతలు లేవని, భారత్‌లోనూ ఇదే విధానం ఉండాలన్నారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను శ్లాబు ప్రకారం 30 శాతం వరకు పన్ను పడుతోంది. అదే లిస్టెడ్ ఈక్విటీలపై లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ కింద రూ. 1.25 లక్షలు దాటాక 12.5 శాతం, షార్ట్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై 15-20 శాతం మాత్రమే పన్ను పడుతోంది. ఈ కారణంగానే మదుపుదారులు ఎక్కువ రిటర్నుల కోసం ఈక్విటీ మార్కెట్లవైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గుముఖం పడుతున్నాయని, రుణాల జారీకి నిధుల కొరత ఏర్పడుతోందని బ్యాంకర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈక్విటీ, బ్యాంకు డిపాజిట్లను ఒకే విధంగా పరిగణించాలని శ్రీనివాసులు శెట్టి కోరారు. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లకు గతంలో ఇచ్చిన పన్ను ప్రోత్సాహకాలు అప్పటి పరిస్థితులకు సరైనవే.. కావొచ్చని, ఇప్పుడు ఈక్విటీ మార్కెట్లపై ఆసక్తి పెరిగిన నేపథ్యంలో ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# ఎప్రిల్ కల్లా అయోధ్య ఆలయం పూర్తి

## నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా

**అయోధ్య :** ఉత్తరప్రదేశ్ అయోధ్యలోని రామాలయ నిర్మాణ పనులన్నీ ఏప్రిల్ 30వ తేదీతో పూర్తికానున్నట్టు రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్చి 19న అయోధ్యలో పర్యటించనున్నారని, ఇందుకు రాష్ట్రపతి తమ సమ్మతి తెలిపారని చెప్పారు. రూ. 1,900 కోట్ల అంచనా వ్యయంతో రామాలయ నిర్మాణం పనులు సాగుతున్నాయి. రామాలయ నిర్మాణ కమిటీతో రెండ్రోజుల పాటు సమావేశమైన అనంతరం నృపేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడుతూ, ఆలయ నిర్మాణ పనులకు ఎల్ అండ్ టీ, టాటా కన్‌స్టలెన్సీలతో మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నామని, ఏప్రిల్ 30వ తేదీకి నాటికి పనులు పూర్తి అవుతాయని చెప్పారు. ఆ రోజుకు అన్ని పేపర్ వర్క్‌లతో పాటు బిల్ పేమెంట్ ప్రొసీజర్లు కూడా పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో ఆలయం శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ పరిధిలోకి వస్తుందని తెలిపారు. రామాలయ ప్రాజెక్టుకు రూ. 1,900 కోట్ల ఖర్చును అంచనా వేయగా, జీఎస్‌టీతో సహా రూ. 1,600 కోట్లు ఇప్పటికే చెల్లించామని మిశ్రా వివరించారు.

# అమెరికాతో ఒప్పందంపై తొందరలేదు

## ఈయూతో ఒప్పందంతో దేశానికి మేలు
## అమలయ్యే తేదీని త్వరలో ప్రకటిస్తాం
## వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ వెల్లడి



**న్యూఢిల్లీ :** ఇటీవల భారత్ యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరిణామం తర్వాత అమెరికాతో కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్ కుదుర్చుకుంటుందా? అనే ప్రశ్నకు భారత వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ లేదని జవాబిచ్చారు. ఆయన ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. రష్యాతో చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా 50 శాతం పన్నుల్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా బెదిరింపులకు లొంగి.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి భారత్ లొంగిపోయిందనే వార్తలొచ్చాయి. అయితే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ముగింపు దిశగా సాగుతుందని పీయుష్ గోయల్ తాజాగా అన్నారు. ఇయుతో భారత్ కుదుర్చుకున్నది మంచి ఒప్పందం. ఈ ఒప్పందం విషయంలో మేము చాలా చురుగ్గా పాల్గొన్నాము. ఈ ఒప్పందం విషయంలో ఇరుపక్షాలు సంతృప్తి చెందాయి. ఈ ఒప్పందం ఎప్పుడు అమల్లోకి వస్తుందో తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన ఈ ఇంటర్వ్యూలో చెప్పారు. ÷ూగా, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం చేసుకుంటుందా? అని ప్రశ్నించగా.. అమెరికాతో ఒప్పందం విషయంలో కానీ.. ఆ దేశంతో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు కానీ ఏమీ లేవని నేనకుటున్నాను. కానీ ప్రస్తుతం మేము అమెరికాతో ఒప్పందం చేసుకోకూడదని అనుకుంటున్నాము. ఆ దేశంతో ఒప్పందం ముగించాలనే ఆలోచిస్తున్నాము అని గోయల్ అన్నారు. ÷నడా ప్రధాని మార్క్ కార్నీ ఈ ఏడాది మార్చిలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో కెనడాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశముందని గోయల్ తెలిపారు.

# మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

## శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక
## కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె
## అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ



**ముంబై :** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు.విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగం ప్రకారం శాసన సభ లేదా శాసన మండలికి ఎన్నిక కాని వ్యక్తి కూడా మంత్రి పదవి చేపట్టవచ్చు. అయితే ఆ వ్యక్తి ఆరు నెలల్లోగా శాసనసభ సభలేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వాలి. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్‌సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బుల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనుకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.






# చివరి టీ20 మనదే

## ఐదో టీ20లో భారత్ ఘనవిజయం.. 4-1తో సిరీస్ కైవసం

**కేవలం 42 బంతుల్లో సెంచరీ నమోదు చేసిన ఇషాన్ కిషన్**

**ఐదు వికెట్లు పడగొట్టి కివీస్ పతనాన్ని శాసించిన అర్షదీప్ సింగ్**


**80 పరుగులతో ఒంటరి పోరాటం చేసిన న్యూజిలాండ్ బ్యాటర్ ఫిన్ అలెన్**

**టీ20 ప్రపంచకప్‌కు ముందు టీమిండియాకు కీలక విజయం**



న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో, చివరి టీ20లో టీమిండియా 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్ (103) విధ్వంసక సెంచరీకి, అర్ష్‌దీప్ సింగ్ (5/51) ఐదు వికెట్ల ప్రదర్శన తోడవడంతో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. భారత్ నిర్దేశించిన 272 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో, కివీస్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌కు ఫిన్ అలెన్ (38 బంతుల్లో 80) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో కివీస్ పవర్‌ప్లేలో వికెట్ నష్టానికి 79 పరుగులు చేసి భారత్‌పై తమ అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. అయితే, దూకుడుగా ఆడుతున్న అలెన్‌ను అక్షర్ పటేల్ (3/33) పెవిలియన్ పంపడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తొలి స్పెల్‌లో భారీగా పరుగులు ఇచ్చినప్పటికీ, అర్షదీప్ సింగ్ తన రెండో స్పెల్‌లో అద్భుతంగా రాణించాడు. కీలకమైన రచిన్ రవీంద్ర (30) వికెట్‌తో పాటు మరో నాలుగు వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. దీంతో న్యూజిలాండ్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. టీ20 ప్రపంచకప్‌కు వారం ముందు ఈ సిరీస్ విజయం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచనుంది. అంతకుముందు, టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 42 బంతుల్లోనే తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63) చక్కటి సహకారం అందించాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 42) మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ స్కోరును అమాంతం పెంచాడు. ఇది టీ20 ఫార్మాట్‌లో భారత్‌కు మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం.

## టీ20 ప్రపంచ కప్ నుంచి పాట్ కమ్మిన్స్ ఔట్!



టీ20 ప్రపంచ కప్ 2026 కోసం ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించింది. బోర్డు మొదట ప్రాథమిక జట్టును ఎంపిక చేయగా ఇందులో మాజీ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కూడా ఉన్నాడు, కానీ తాజాగా ప్రకటించిన జట్టులో అతడి పేరు లేదు. దాంతో కమిన్స్ టోర్నమెంట్ నుండి వైదొలిగాడు. కమ్మిన్స్ మాత్రమే కాదు, ఆస్ట్రేలియా ప్రాథమికంగా ప్రకటించిన జట్టులో తాజాగా 2 మార్పులు చేసింది. జనవరి 31న ప్రకటించిన జట్టులో మార్పులు చేయడానికి చివరి తేదీ అని తెలిపింది. భారత్, శ్రీలంకలో జరగనున్న టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి మరో వారం రోజులు మాత్రమే ఉన్నాయి. ఫిబ్రవరి 7వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్లో మొత్తం 20 జట్లు ఆడతాయి. వీటిని 5 జట్ల చొప్పున 4 గ్రూపులుగా విభజించారు. ఆస్ట్రేలియా గ్రూప్ దీలో ఉంది. ఈ గ్రూప్లోని అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలో జరుగుతాయి. ఆస్ట్రేలియాకు జట్టుకు ముందే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. పాట్ కమ్మిన్స్ వెన్నునొప్పి (లంబర్ స్ట్రెస్ ఇంజురీ) నుండి కోలుకుంటారని, టీ20 ప్రపంచ కప్లో ఆడతారని మేనేజ్‌మెంట్ భావించింది. ప్రారంభ జట్టులో అతడి పేరు ఉంది. కానీ ప్రధాన జట్టులో అతడి పేరు లేకుండా ప్రకటన చేశారు. పాట్ కమ్మిన్స్ మాత్రమే కాదు, తొలుత జట్టులో ఉన్న మాథ్యూ షార్ట్ కూడా ప్రధాన జట్టులో భాగం కాదు. వీళ్లిద్దరి స్థానంలో మాట్ రెన్షా, బెన్ ద్వార్షుయిస్లను ఆసీస్ జట్టులోకి తీసుకున్నారు. అనుభవజ్ఞుడైన ఆల్ రౌండర్ బౌలర్ కమ్మిన్స్ జట్టుకు దూరమవ్వడం జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే, కానీ మిచెల్ మార్ష్ కెప్టెన్సీలోని ఈ జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. ఇందులో ట్రావిస్ హెడ్, టీమ్ డేవిడ్, జోష్ ఇంగ్లిస్, కామెరాన్ గ్రీన్, జోష్ హేజిల్ వుడ్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్ వెల్ వంటి స్టార్ ప్లేయర్లు ఉన్నారు. వీరంతా టీ20 ఫార్మాట్లో సత్తా చాటిన క్రికెటర్లు.

### ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్లెట్, టిమ్ డేవిడ్, కూపర్ కనోలీ, బెన్ ద్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ హేజిల్ వుడ్, నాథన్ ఎల్లిస్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమన్, గ్లెన్ మాక్స్ వెల్, మార్కస్ స్టోయినిస్, మాథ్యూ రెన్షా, ఆడమ్ జంపా.



## ఆస్ట్రేలియా ఓపెన్ 2026 విజేతగా ఎలైనా రైబకినా

### తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను ముద్దాడిన రైబకినా

ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్థాన్ స్టార్ ఎలైనా రైబకినా నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అరీనా సబలెంకా 4-6, 6-4, 4-6 తేడాతో ఐదో సీడ్ ఎలైనా రైబకినా చేతిలో ఓటమిపాలైంది. అద్వితీయమైన ప్రదర్శనతో వరల్డ్ నెంబర్ వన్ సబలెంకాకు షాకిచ్చిన ఎలైనా రైబకినా కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను ముద్దాడింది. ఓవరాల్‌గా ఎలైనా రైబకినాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్. అంతకుముందు వింబుల్డన్ 2022 టైటిల్ గెలిచింది. తాజా విజయంతో ఆస్ట్రేలియా ఓపెన్ 2023 ఫైనల్లో సబలెంకా చేతిలో ఎదురైనా పరాజయానికి రైబకినా ప్రతీకారం తీర్చుకుంది.ఆస్ట్రేలియా ఓపెనర్ 2026 విజేతగా నిలిచిన ఎలైనా రైబకినాకు రూ.25 కోట్ల 25 లక్షల రూపాయల ప్రైజ్‌మనీ లభించింది. ఈ గెలుపుతో రైబకినా తన కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్ నెంబర్ 3కి చేరుకోనుంది. సుమారు 2 గంటల 18 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఎలెనా రైబకినా పై చేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఒక దశలో రైబకినా 0-3తో వెనుకంజలో నిలిచింది. దాంతో సబలెంకా విజయం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ రైబకినా నేలకు కొట్టిన బంతిలా పుంజుకొని వరుస గేమ్‌లు గెలిచి సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించిన రైబకినా 37 నిమిషాల్లోనే 6-4తో గెలిచింది. రెండో సెట్‌లో సబలెంకా పుంజుకోవడంతో పోరు హోరాహోరీగా మారింది. 55 నిమిషాల పోరాటం తర్వాత 6-4తో సబలెంకా రెండో సెట్ కైవసం చేసుకుంది. దాంతో నిర్ణయాత్మక మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అత్యంత ఉత్కంఠగా సాగిన ఈ సెట్‌లో రైబకినా వెనుకంజలో నిలిచినా.. పట్టు విడవకుండా పోరాడి 46 నిమిషాల్లో సెట్‌ను కైవసం చేసుకోవడంతో పాటు తొలి టైటిల్‌ను ముద్దాడింది.ఈ ఓటమిని తట్టుకోలేకపోయిన సబలెంకా తన సీట్లో కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చింది. మూడో సెట్‌లో 3-0తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ మ్యాచ్ చేజారడాన్ని ఆమె తట్టుకోలేకపోయింది. ఇప్పటి వరకు నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన సబలెంకా.. మరో నాలుగు ఫైనల్లో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ఒక సెట్ కూడా కోల్పోకుండా విజయాల పరంపర కొనసాగించిన సబలెంకాకు రైబకినా బ్రేక్ వేసింది. 2001, 2002 ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఛాంపియన్ అయిన జెన్నిఫర్ కాప్రియాటి చేతుల మీదుగా రైబకినా టైటిల్ అందుకుంది.

## గాయంతోనే జ్వెరెవ్‌ను చిత్తు చేసిన అల్కరాజ్!



మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో టెన్నిస్ ప్రపంచం ఓ అద్భుతమైన పోరాటాన్ని వీక్షించింది. టెన్నిస్ ఫ్యాన్స్ దశాబ్దాల పాటు గుర్తుంచుకునే అద్భుత ఘట్టం రోడ్ లేవర్ ఎరీనాలో ఆవిష్కృతమైంది. స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్, జర్మనీ దిగ్గజం అలెగ్జాండర్ జ్వెరెవ్‌ల మధ్య 5 గంటల పాటు సాగిన మెగా వార్‌లో అల్కరాజ్ విజేతగా నిలిచాడు. తొడ, నడుము గాయంతో విలవిల్లాడుతున్నా ఏ మాత్రం పట్టువదలకుండా పోరాడి తన కెరీర్లో మొదటిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు.మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో కార్లోస్ అల్కరాజ్ తీవ్రమైన నొప్పితో కోర్టులోనే కుప్పకూలాడు. ఆయనకు మెడికల్ టైమ్-అవుట్ ఇవ్వడంపై జ్వెరెవ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. కండరాలు పట్టివేస్తే టైమ్-అవుట్ ఇవ్వకూడదనే నిబంధనను ఆయన గుర్తు చేశాడు. అయితే అల్కరాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆట కాసేపు నిలిచిపోయింది.తొలి రెండు సెట్లను 6-4, 7-6(5)తో గెలుచుకున్న అల్కరాజ్‌కు, గాయం తర్వాత జ్వెరెవ్ గట్టి పోటీ ఇచ్చాడు. తర్వాతి రెండు సెట్లను టై-బ్రేకర్లలో గెలిచిన జ్వెరెవ్ మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లోనూ జ్వెరెవ్ 3-1తో ముందంజలో ఉన్నప్పుడు అల్కరాజ్ కథ ముగిసిందని అందరూ భావించారు. కానీ కాలికి బ్యాండేజీతోనే సింహంలా పోరాడిన అల్కరాజ్.. వరుస గేమ్ పాయింట్లతో 7-5తో చివరి సెట్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను ముగించాడు.వచ్చే ఆదివారం జరగబోయే ఫైనల్‌లో అల్కరాజ్ విజయం సాధిస్తే, టెన్నిస్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో 'కెరీర్ గ్రాండ్ స్లామ్' (నాలుగు ప్రధాన టైటిల్స్ గెలవడం) పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఓపెన్ ఎరాలో ఈ ఘనత సాధించిన ఎనిమిదో ఆటగాడిగా ఆయన నిలుస్తారు. ఫైనల్‌లో అల్కరాజ్, నొవాక్ జకోవిచ్ లేదా యానిక్ సినర్‌తో తలపడనున్నారు. ఆదివారం మెల్‌బోర్న్ పార్క్ ఓ సరికొత్త చరిత్రకు సాక్షిగా నిలవబోతోంది.

# ఎంవీఐలపై జిల్లా కలెక్టర్ అసహనం

## పిల్లల పార్కు నిర్వహణపై అసంతృప్తి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో నిర్వాహణ సక్రమంగా లేదంటూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మోటార్ వెహికిల్ ఇన్స్ పెక్టర్లపై అసహనం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వివిధ రంగాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి శనివారం తిమ్మాపూర్ రవాణాశాఖ కార్యాలయ పిల్లల పార్కు ఆడిటోరియంలో సర్టిఫికెట్లను, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కును పరిశీలించారు. గతంలో రూ.20లక్షలు కేటాయించి ప్లాంటేషన్, డ్రిప్, స్ప్రింక్లర్ లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తే వాటిని నిర్వాహణ ఏదంటూ డీటీవో శ్రీకాంత్ ని ప్రశ్నించారు. తాము 20లక్షల నిధులు కేటాయిస్తే కనీసం 20వేల రూపాయలు ఖర్చు చేసి నిర్వహణ చేసే పరిస్థితి లేదని కలెక్టర్ అంసతృప్తి వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ల ప్రధానంలో విద్యార్థులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మీరు వాహనాలను జాగ్రత్తగా నడుపాలని, విద్యార్థులు వాహనాలు నడపవద్దని, విద్యార్థుల చేతిలో ఏదైనా ప్రమాదం జరిగి ఇతరులకు నష్టం జరిగితే కేసులు నమోదు అయి కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఇండియాలో అత్యధిక ద్విచక్ర వాహనాలున్నాయని, రోడ్డుపై ప్రయాణం, భద్రత చాలా ముఖ్యమని అన్నారు. మానవ తప్పిదం వల్ల ప్రమాదం జరుగకుండా చూసుకోవాలని, ప్రాణ నష్టం జరిగితే ఆ కుటుంభానికే ఎక్కువ నష్టం వాటిల్లుతుందని తెలిపారు. వాహనదారునికి క్రమణశిక్షణ ఉ ంటే రోడ్డుపై తనిఖీలు అవసరములేదన్నారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఎంవీఐ రవి కుమార్, ఏఎంవీఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు పకడ్బందీ చర్యలు

## మండల వేసవి కార్యాచరణ ప్రణాళిక ఖరారు

## ఫిబ్రవరి 2 నుంచి గ్రామాల్లో కమిటీల పర్యటన

## ఎంపీడీవో టీ విజయ్ కుమార్



చిగురుమామిడి, జనత న్యూస్: వేసవి కాలంలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయి కమిటీ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను శనివారం విడుదల చేశారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాస ప్రాంతాల్లో మండల స్థాయి కమిటీ పర్యటించనుంది.క్షేత్రస్థాయిలో నీటి సరఫరా విధానాన్ని పరిశీలించి, ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేలా ఈ కమిటీ చర్యలు తీసుకోనుంది.

### పర్యటన వివరాలు ఇవే..

మండల స్థాయి కమిటీ ఫిబ్రవరి 2న సీతారాంపూర్, లంబాడిపల్లి గ్రామాల్లో పర్యటిస్తుంది. అనంతరం 9న ముల్కనూర్, పీచుపల్లి, 10న రామంచ, ఓగులాపూర్, 11న ముదిమాణిక్యం, గునుకులపల్లి, 12న ఇందుర్తి, 13న సుందరగిరి, గాగిరెడ్డిపల్లి, 16న రేకొండ, 17న బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, 18న నవాబ్‌పేట, కొండాపూర్, 19న చిగురుమామిడి గ్రామాల్లో పర్యటిస్తారు.

### క్షేత్రస్థాయి పరిశీలన

ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పర్యటనలు సాగుతాయి. ఆయా గ్రామాల్లో నీటి సరఫరాకు సంబంధించిన లోపాలను గుర్తించి నివేదికను జిల్లా యంత్రాంగానికి సమర్పించనున్నారు. ఈ పర్యటనలో ఎంపీఓ, ఆర్డబ్ల్యూఎస్ (ఇంట్రా, గ్రిడ్) ఏఈలు, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని ఎంపీడీఓ ఆదేశించారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## ఉమ్మడి మెదక్ జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బోయిని సంపత్



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ క్లస్టర్ పరిధిలో ఉన్న 108, 102,1962 వాహనాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి మెదక్ జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బోయిని సంపత్ సూచించారు.శనివారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని 108, 102,1962 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వాహనాల పనితీరును,సిబ్బంది పనితీరును పరిశీలించారు.హుస్నాబాద్ క్లస్టర్ లో ఉన్న 108 102 1962 సేవలను మరింత పకడ్బందీగా నిర్వహించాలని,ప్రజలకు మెరుగైన సేవల అందిస్తూ వాహనాల వినియోగం ప్రజలకు తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది రాజు, సతీష్, జగన్,రాజు, 102 సిబ్బంది శ్రీధర్, 1962 సిబ్బంది సృజన్, డాక్టర్ ప్రవళిక, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సంతకం కూడా ఫోర్జరీ చేస్తారా?

## మంత్రి సంతకం ఫోర్జరీపై విచారణ జరపాలి

## ఎమ్మెల్యే ధన దాహం అగాధ : రసమయి బాలకిషన్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఎమ్మెల్యే ధన దాహం దళిత మంత్రి సంతకాన్ని ఫోర్జరీ చేసే స్థాయికి వెళ్లిందని, ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో సీఎం సంతకాన్ని కూడా ఫోర్జరీ చేస్తారా అంటూ మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గనుల శాఖ మంత్రి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫేక్ లెటర్ తయారుచేసి సుమారు రూ.200 కోట్ల కుంభకోణానికి తెరలేపారని ఆయన ఆరోపించారు. ఒక దళిత మంత్రి సంతకాన్నే ఫోర్జరీ చేస్తే, సామాన్యుల పరిస్థితి ఏంటో అర్థమవుతోందన్నారు. ఫోర్జరీ చేసిన సంతకం మంత్రి వివేక్‌దేనా కాదా అనే విషయాన్ని దమ్ముంటే రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యే అక్రమాలు, అరాచకాలపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మైలారం మల్లికార్జున స్వామి ఆలయ పరిసర గుట్టలను కూడా గ్రానైట్ క్వారీలుగా మార్చి డబ్బులు దండుకోవడమే ఎమ్మెల్యే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. వెంటనే అక్కడి నుంచి యంత్రాలను తొలగించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో మరే నియోజకవర్గంలో లేని విధంగా మానకొండూర్ నియోజకవర్గంపై నిత్యం వివాదాస్పద వార్తలు వస్తున్నాయని అన్నారు. షాడో ఎమ్మెల్యే అరాచకాలు, కమీషన్లు, అకృత్యాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయని పేర్కొన్నారు. పత్రికల్లో షాడో ఎమ్మెల్యేపై వరుస కథనాలు వస్తున్నా ఎమ్మెల్యే స్పందించకపోవడం వెనుక కారణమేంటని ప్రశ్నించారు. చివరకు షాడో ఎమ్మెల్యే కారణంగానే మంత్రి పదవి కోల్పోయారనే అంశం కూడా బహిరంగ చర్చగా మారిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మిడ్ మానేరు నుంచి కాలువల ద్వారా నీటిని తీసుకొచ్చి గన్నేరువరం మండలాన్ని అభివృద్ధి చేసి రైతుల కాళ్లు కడిగినట్టుగా పని చేశానన్నారు. గన్నేరువరం మండలంలోని చిన్న గుట్టలపైనా ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యే కన్నుపడి కబ్జా చేసే వరకు రుకోలేదని ఆరోపించారు. అగర్వాల్ కార్వాకు చెందిన గ్రానైట్ క్వారీ వద్ద సుడా చైర్మన్, షాడో ఎమ్మెల్యే బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేసినది నిజం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుక క్వారీలు, గనులను కబ్జా చేశారని, ఇథనాల్ ఫ్యాక్టరీ నుంచి రూ.30 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. అర్జెంటుగా రూ.200 కోట్లు సంపాదించడమే వారి లక్ష్యమని విమర్శించారు. అలుగునూర్ చౌరస్తాలో దుకాణం ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్, సామగ్రిని అక్కడి నుంచే కొనాల్సిందిగా ఒత్తిడి తెచ్చి డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. సుడా చైర్మన్‌కు కూడా హెచ్చరిక జారీ చేస్తూ, మానకొండూర్ నియోజకవర్గాన్ని నాశనం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఎమ్మెల్యే నువ్వా, షాడో నువ్వా ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్‌తో పాటు నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉ ల్లెంగుల ఏకానందం, నాయిని వెంకటరెడ్డి, గంప వెంకన్న, ల్యాగల వీరారెడ్డి, పాశం అశోక్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, ఎలుక ఆంజనేయులు, వంతడుపుల సంపత్, మాతంగి లక్ష్మణ్, సల్ల మహేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో దర్యాప్తు అవసరమే లేదు

## చిట్ చాట్ లో మాజీ ఎంపీ వినోద్ కుమార్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఫోన్ ట్యాపింగ్ లో దర్యాప్తు అవసరమే లేదని, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉందని, పోలీస్ యంత్రాంగం స్వతంత్ర విచారణ జరపడంలేదని, రాజకీయ కక్ష్యలో భాగంగా విచారణ చేస్తున్నారని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. 50ఏళ్ల క్రితం రాజకీయ కక్ష సాధింపులకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడిందని తెలిపారు. మానకొండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్ మీడియాతో చిట్ చాట్ లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రాంకిషన్ రావుతో కలసి పాల్గొన్నారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. ఇంటిలిజెన్స్ అనేది ఒక వ్యవస్థ అని, దీని ద్వారా రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడుకునేందుకు ఆ వ్యవస్థ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ అధికారులు చేస్తారని, దీనిని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వాడుకుంటున్నారని ఆరోపించారు.

కవిత రాజకీయంగా విభేదించిన తరువాత మాట్లాడుతుందని, అంతకు ముందు ఎందుకు చెప్పలేదని ఆయన ప్రశ్నించారు. నేను తెలంగాణ గాడుపుల గెలిచిన, మోడీ గాడుపుల బండి సంజయ్ గెలిచినట్లు ఆయన తెలిపారు. 2027లో డిలిమిటేషన్ జరిగిన తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయని, తాను పార్టీ ఆదేశాల మేరకు సిరిసిల్ల టూ డోర్నకల్ వరకు రెండు ఉమ్మడి జిల్లాలో ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేగా గానీ ఎంపీగా గానీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తాను 50ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఓడినా.. గెలిచినా చచ్చే వరకు రాజకీయాల్లో ఉంటాన ని స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలోనే ముందస్తుగా ఆలోచించి మానేరుపై తీగల వంతెనను నిర్మిస్తే ఇప్పుడు పరిస్థితి దయనీయంగా తయారైందని అన్నారు. గతంలో లైటింగ్ తో సుందరంగా ఉండేదని, పర్యాటకంగా మారిందని, చిరు వ్యాపారులు బ్రతికినట్లు, ప్రస్తుతం నిర్వహణ లోపించిందని అన్నారు.

ప్రభుత్వ పనితీరుతో అధ్వానంగా తయారైందని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీని చేసే విషయంలో బీఆర్ఎస్ కృషి గొప్పదని, తాను జగిత్యాల టూ కోదాడ వరకు జాతీయ రహదారి తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తే ఇప్పుడు పనులు మన ముందర కనిపిస్తున్నాయని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలో చిన్న చిన్న రోడ్లను కూడా రిపేర్లు చేసే పరిస్థితి ఈ ప్రభుత్వంలో లేదు. ప్రతిపక్షంలో ఉన్నాగానీ, ప్రజా సమస్యలపై కొట్లాడుతామని తెలిపారు. రెండున్నర ఏళ్ల అవకాశం ఇచ్చి ఆ తర్వాత ప్రభుత్వాన్ని నిలదీయాలని అనుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ ను రేపు సిట్ విచారించనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రేపు నిరసన, ధర్నాలకు పిలుపునచ్చినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రాంకిషన్ రావు తెలిపారు. ఈ చిట్ చాట్ లో బీఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, రామంచ గోపాల్ రెడ్డి, సంపత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక కవిత్వంలో 'రూప సూక్తం' విశిష్టత




## డా. గండ్ర లక్ష్మణ రావు

కరీంనగర్, జనతా న్యూస్ : ఆధునిక కవిత్వంలో 'రూప సూక్తం'కు ప్రత్యేక స్థానం ఉందని డా. గండ్ర లక్ష్మణ రావు అన్నారు. సర్వ వైదిక సంస్థానం యజ్ఞ వరాహ క్షేత్రంలో శనివారం సాయంత్రం పద్మశ్రీ శ్రీభాష్యం విజయ సారథి రచించిన 'రూప సూక్తం'పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. సూక్త ఆవిర్భావం వేదాల నుంచే జరిగిందని, మంత్రమే సూక్తమని ఆయన వివరించారు. విజయ సారథి గొప్ప కవితో పాటు గొప్ప పండితుడని ప్రశంసించారు. వైదిక సాహిత్యాన్ని సులభంగా సామాన్యులకు అందించినవారు శ్రీభాష్యమని తెలిపారు. అభ్యుదయ భావనను సూక్త రూపంలో వ్యక్తపరిచిన ఘనత విజయ సారథిదేనని పేర్కొన్నారు. సూక్త ప్రయోగాన్ని సాహిత్యంలో ప్రవేశపెట్టింది కూడా ఆయనేనని అన్నారు. విజయ సారథి కవిత్వంలో జీవుడు--దేవుడు మధ్య సంబంధాన్ని సున్నితంగా ఆవిష్కరించారని చెప్పారు.

'రూప సూక్తం' రూపాయిపై ఆధారపడినదిగా కనిపించినా, అంతర్లీనంగా లక్ష్మీ తత్వాన్ని ప్రతిబింబిస్తుందని విశ్లేషించారు. లౌకిక, సామాజిక రూపం బయట కనిపించినా, లోన ఆధ్యాత్మిక భావం దాగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వర ప్రసాద శర్మ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా శ్రీభాష్యం రచనలపై ప్రసంగాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బి. కరుణాకర్ రావు మాట్లాడుతూ, శ్రీభాష్యం తమ గ్రామానికి చెందినవారు కావడం గర్వకారణమన్నారు. వారి సంస్కృత సాహిత్యం విశిష్టమైందని, అందరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంస్కృత పండితులు వేద ధర్మ పరిరక్షణకు విశేష కృషి చేశారని తెలిపారు. ఆత్మీయ అతిథిగా మాడిశెట్టి గోపాల్ పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణను కె.ఎస్. అనంతాచార్య, కాందూరి వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణు శ్రీ, గంప ఉమాపతి, నరేందర్, ఎలాగందుల సత్యనారాయణ, విఠల శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి

**బీఎల్‌ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాలి**

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి : జిల్లాలో త్వరలోనే మ్యాపింగ్ పూర్తి**




కరీంనగర్,జనతా న్యూస్ : ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియతో పాటు ఇతర అంశాలపై శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఓటర్ ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు. 2002 ఓటర్ లిస్ట్ వివరాలతో ప్రస్తుత వివరాలను సరిపోల్చుతూ మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఫీల్డ్‌కి వెళ్లి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. బీఎల్‌ఓలు రోజువారీగా ప్రోజెని మ్యాపింగ్ వివరాలను నివేదించాలని తెలిపారు.

బీఎల్‌ఓలకు ఈ ప్రక్రియలో ఏబీఎల్‌ఓలు పూర్తి సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద మ్యాపింగ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత బీఎల్‌ఓలు సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. నిర్ణీత గడువులోగా మ్యాపింగ్ పూర్తి చేయాలని, తప్పులు జరగకుండా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఆదేశించారు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, 2002 ఓటర్ లిస్టు ఆధారంగా కొత్త ఓటర్ లిస్ట్ మ్యాపింగ్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌ఓలతో ప్రత్యేక దృష్టి సారించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై ఓటర్ లిస్ట్ మ్యాపింగ్‌పై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ అర్బన్ ప్రాంతంలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ మిగిలి ఉన్న ఓటర్లను వెంటనే మ్యాపింగ్ చేయించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. బీఎల్‌ఓ సూపర్వైజర్లు తక్కువ పురోగతి ఉన్న ప్రాంతాల్లో బీఎల్‌ఓలతో కలిసి డోర్ టు డోర్ సందర్శనలు చేస్తూ లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతానికి అధికారులంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కుందారపు మహేష్, రమేష్ బాబు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వినతులు స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతవరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబోమని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

**ప్రజలంతా ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలతో ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శనివారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించారు. సిఎస్ఆర్ ఫండ్ కింద హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ సంస్థ రూ. 2.30 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను ఇటీవల ఆసుపత్రికి అందజేసింది. ఇందులో 500 ఎంఏ సామ-ర్థ్యంతో కూడిన ఎక్స్‌రే యూనిట్ (ఏడోనిస్ కంపెనీ), లాప్రోస్కోపీ పరికరాలు (స్మిత్ నెఫ్యూ అడ్వాన్స్ టెక్నాలజీ), డాప్లర్ అల్ట్రాసౌండ్ మిషన్ (లాజిక్ ఈ -- జీఈ హెల్త్ కంపెనీ) వంటి ఆధునిక పరికరాలు ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ అవియోనిక్స్ డివిజన్ సంస్థ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి అధునాతన వైద్య పరికరాలు అందజేయడం అభినందనీయమన్నారు. వీటి ద్వారా ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా సేవలు అందుతున్నాయని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. అధునాతన వైద్య పరికరాల ద్వారా అనేక రకాల శస్త్రచికిత్సలు, మెరుగైన వైద్య సేవలు అందించడం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ ఉదయ్ ఆదిత్యతో పాటు పలువురు వైద్య నిపుణులు, డాక్టర్లు పాల్గొన్నారు.

# డబ్ల్యూజేఐ జిల్లా శాఖ డైరీ ఆవిష్కరణ

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా విడుదల**



కరీంనగర్, జనతా న్యూస్ : జనవరి 31 : వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బీఎంఎస్) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు దారం జగన్నాథ రెడ్డి నేతృత్వంలో జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం డైరీని ముద్రించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా కమిటీకి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని జర్నలిస్టుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసేలా ఈ డైరీ ఉపయోగపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మొగురం రమేష్, కోశాధికారి చిట్టిమళ్ళ మహేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, గంగం రాజు పాల్గొన్నారు.

# కరీంనగర్ మేయర్, మూడు మున్సిపాలిటీల చైర్మన్ పీఠాలు బీజేపీవే

**అత్యధిక స్థానాల గెలుపే లక్ష్యం -- కేంద్ర మంత్రి బండి సంజయ్**



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠంతో పాటు మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సర్వేల్లో తేలిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం కరీంనగర్‌లోని శుభం కన్వెన్షన్‌లో కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంఛార్జీలు, కన్వీనర్లు, కో-కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని నమ్ముకుని కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే టిక్కెట్ల విషయంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో 80 శాతం పైగా టిక్కెట్లు కార్యకర్తలకే ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. గెలిచే అవకాశం లేని చోట్ల మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. టిక్కెట్ రాని కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల ద్వారా వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకునే నిర్ణయాలు తీసుకోవద్దని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కార్యకర్తలకు సూచించారు. ప్రతి డివిజన్‌లో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధుల ద్వారానే సాధ్యమయ్యాయని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే బీజేపీకి ఓటేసి ఆశీర్వదించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండాను ఎగరేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ సీనియర్ నేతలు సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను, ఇనుగొండ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోపు మల్లారెడ్డికి అవకాశం ఇవ్వాలి

**అల్లునూరు ఓటర్లను కోరిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోపు మల్లారెడ్డికి కార్పొరేటర్‌గా అవకాశం కల్పించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అల్లునూరు ఓటర్లను కోరారు. శనివారం అల్లునూరులో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వినూత్న పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గోపు మల్లారెడ్డిని కార్పొరేటర్‌గా గెలిపిస్తే 8వ డివిజన్ శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, డివిజన్ మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్‌తో పాటు పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణరెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, ముంజ స్వాతి--శ్రీకాంత్ గౌడ్, అట్ల అనిల్ కుమార్, తొర్తి అరవింద్, ఐతం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం




కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించిన ఐదుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కమీషనరేట్ కార్యాలయం నుంచి ఏవో వై.వి. మునిరామయ్య, మహిళా పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై చల్ల రాజన్న, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి మహమ్మద్ ముస్తఫా, ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుంచి ఏఆర్ ఎస్సైలు ఖలీల్, మహమ్మద్ బాషు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ (పరిపాలన) వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని నిబద్ధతతో, విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం కీలకమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన అధికారులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలను అందజేసి వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీబీ ఏసీపీ శ్రీనివాస్, సీసీబీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) రజినీకాంత్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర 2026






ములుగు, జనతా న్యూస్ : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతర 2026 భక్తిప్రపత్తుల మధ్య ఘనంగా ముగిసింది. శనివారం సాయంత్రం 7 గంటల 55 నిమిషాలకు వన దేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలను వీడి వన ప్రవేశం చేయడంతో జాతర అధికారికంగా పరిసమాప్తమైంది. వేలాది మంది భక్తుల జయజయధ్వానాల నడుమ భావోద్వేగ వాతావరణంలో అమ్మవార్లు చిలకలగుట్ట, కన్నెపల్లి వైపు పయనమయ్యారు. "వన దేవతలు వనం లోకి" అంటూ భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. పోరాటం, త్యాగం, నమ్మకాలతో ముడిపడిన ఈ జాతరలో గిరిజన సంప్రదాయాలు సజీవంగా దర్శనమిచ్చాయి. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు నిలువెత్తు బంగారం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

# కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## భోజన నాణ్యతలో లోపాలపై ఆగ్రహం : ఎస్ఓపై చర్యలకు ఆదేశం



సిద్దిపేట,జనతా న్యూస్ :

బెజ్జంకి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి రాత్రి భోజన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు అందించిన అన్నం, దోసకాయ, పప్పు చారు, వంకాయ చట్నీ, పెరుగులను స్వయంగా తనిఖీ చేశారు. పప్పు చారులో పప్పు సరిపడా లేకపోవడంపై, వంకాయ చట్నీ చాలా తక్కువగా వండడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు మేరకు వంట సరుకులు అందించారా? సరిపడినంత భోజనం ఎందుకు వండలేదని ఎస్ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెను రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్‌లో పేర్కొన్న పరిమాణానికి వాస్తవంగా వండిన కూరలకు పొంతన లేదని అసహనం వ్యక్తం చేశారు. మెను తప్పనిసరిగా పాటించడంతో పాటు విద్యార్థులకు అన్ని ఆహార పదార్థాలు సమృద్ధిగా అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాణ్యతతో పాటు సరిపడినంత భోజనం వండనందుకు సంబంధించి ఎస్ఓపై చర్యలు తీసుకోవాలని డీఈఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులను పలకరిస్తూ ఆహారాన్ని పూర్తిగా తినాలని, ఏ కూరను కూడా వదలకుండా తినే అలవాటు చేసుకోవాలని, మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. ఎస్ఓ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని, భోజనం, వసతి, చదువు విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని ఆదేశించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

అనంతరం బెజ్జంకి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. రాత్రి సమయంలో వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండి, అత్యంత ఓపికతో జాగ్రత్తగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

# మిట్టపల్లిలోని కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## భోజన నాణ్యత, పరిశుభ్రతపై కఠిన ఆదేశాలు



సిద్దిపేట, జనతా న్యూస్ : సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అన్నం, గుడ్డు, క్యాలీఫ్లవర్ కూర, పప్పు, రసం, పెరుగులను తనిఖీ చేశారు. భోజనం తప్పనిసరిగా డైనింగ్ హాల్‌లోనే వడ్డించాలని, ఇతర ప్రాంతాల్లో వడ్డించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, భోజనం చేసే సమయంలో క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మరల అన్నం లేదా కూరలు కోరినప్పుడు వారు కూర్చున్న చోటికే వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందికి ఆదేశించారు. కామన్ డైట్ మెనూను కచ్చితంగా పాటిస్తూ, నాణ్యమైన మరియు రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులు కడుపునిండా తినేలా వండించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగది మరియు పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, ఈగలు, దోమలు రాకుండా డెటాల్ వంటి శానిటైజర్లతో క్రమం తప్పకుండా శుభ్రపరచాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. తదుపరి కేజీబీవీ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కూరల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, నిర్లక్ష్యంగా వంట చేసి విద్యార్థులకు ఆహారం అందిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన ఆహారాన్ని వండి అందించాలని సిబ్బందిని ఆదేశించారు. డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# ఆపరేషన్ స్మైల్-XII ద్వారా 70 మంది చిన్నారుల రక్షణ

## సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్



సిద్దిపేట, జనతా న్యూస్ : సిద్దిపేట జిల్లాలో బాలల రక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన "ఆపరేషన్ స్మైల్--ఠ××" కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఇప్పటివరకు మొత్తం 70 మంది చిన్నారులను రక్షించినట్లు సీపీ వెల్లడించారు. వీరిలో 52 మంది బాలురు, 18 మంది బాలికలు ఉన్నారు. జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాలకు చెందిన పిల్లలను కూడా ఈ ఆపరేషన్ ద్వారా గుర్తించినట్లు తెలిపారు. రక్షించబడిన వారిలో 49 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కాగా, 21 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారని వివరించారు. రక్షిత చిన్నారులను తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించేందుకు లేదా తగిన శిశు సంరక్షణ కేంద్రాల్లో చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని ఇటుక బట్టీలు, బేకరీలు, హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థల్లో నిర్వహించిన తనిఖీల్లో వెట్టిచాకిరీ చేస్తున్న చిన్నారులను గుర్తించి విముక్తి కల్పించినట్లు తెలిపారు. చదువుకోవాల్సిన వయసులో పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, బాలకార్మిక చట్టాలను ఉల్లంఘించే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు బాధ్యులైన యజమానులపై 12 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సీపీ పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు వారి విద్యపైనే ఆధారపడి ఉంటుందని, వారి బాల్యాన్ని కాపాడటం సమాజం యొక్క సామాజిక బాధ్యత అని సీపీ స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మిక వ్యవస్థ లేదా బాలల హక్కుల ఉల్లంఘనలు గమనించినట్లయితే వెంటనే డయల్ 100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# జర్నలిస్ట్ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేస్తా -- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, జనతా న్యూస్ : సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ రూపొందించిన 2026 జర్నలిస్ట్ డైరీని శనివారం సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి విశేషంగా కృషి చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన జీఓ తీసుకువచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రతి జర్నలిస్టు సంక్షేమానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాయినాథ్, ఉపాధ్యక్షులు ఎర్ర వీరేందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సునీల్, కోశాధికారి నాగభూషణం, పుండరీకం, లక్ష్మణ్, నర్సింలు, కృష్ణతో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com